సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 23 । జనవరి । 2024



పోలీస్ కమాండో పోటీలు

అఖిల భారత పోలీస్ కమాండో పోటీలు విశాఖలోని గ్రేహౌండ్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభమయ్యాయి. 10లో



వినతులకు ప్రాధాన్యం 10లో

జేకేసీలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు.



సూపర్ లగ్జరీలొస్తున్నాయ్!

విశాఖకు కొత్త లగ్జరీ బస్సులొస్తున్నాయి. జిల్లాకు 50కి పైగా అవసరం కాగా తొలి విడతగా 32 బస్సులు వస్తున్నాయి. 10లో

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ విశ్వనాథన్, చిత్రంలో ఇతర అధికారులు

మహారాణిపేట : నిరుద్యోగ యువత స్వస్థలం నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. https@// employment.ap.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించి సోమవారం జిల్లా ఉపాధి కార్యాలయంలో వెబ్‌పోర్టల్ పోస్టర్‌ను జేసీ విశ్వనాథన్ ఆవిష్కరించారు. అభ్యర్థులు విద్యార్హత, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఫొటో, ఇతర ధ్రువ పత్రాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. అప్‌లోడ్ చేసిన దరఖాస్తులను జిల్లా ఉపాధి కార్యాలయం అధికారులు పరిశీలించి రిజిస్ట్రేషన్ కార్డును జనరేట్ చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ కె.మోహన్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, యూనివర్సిటీ ఎంప్లాయిమెంటు బ్యూరో డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఉన్నారు.

రేపు కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్ రాక

సబ్బవరం: కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ బుధవారం సబ్బవరం రానున్నారని ఎంపీడీవో బి.రమేష్ నాయుడు సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొనున్నారన్నారు. దేశ వ్యాప్తంగా 65 లక్షల గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18 రకాల ప్రాయోజిత కార్యక్రమాలను ప్రజలకు ఈ కార్యక్రమంలో వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఇంటింటా రామజ్యోతి



- అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్టతో పులకించిన విశాఖ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కీర్తనలు, భజనలు
- రుషికొండ సముద్రం అడుగున రాముని విగ్రహ ప్రతిష్ట
- జిల్లావ్యాప్తంగా పండగ వాతావరణం



మేయర్ దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష



రామ జపంతో మార్మోగిన అంబికాబాగ్ రామాలయం



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

విశాఖ సిటీ : రామ నామస్మరణతో సాగరతీరం ఉవ్వెత్తున ఎగిసిపడింది. విశాఖ రామమయంగా మారిపోయింది. అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్టతో జిల్లాలో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. భక్తజనమంతా శ్రీరాముని పారవశ్యంలో మునిగిపోయింది. నగరం, గ్రామీణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా పండగ వాతావరణమే కనిపించింది. ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఎక్కడ చూసినా శ్రీరాముడి కీర్తనలు, భజనాలతో దేవాలయాలు మార్మోగిపోయాయి.

సర్వాంగ సుందరంగా ఆలయాలు

ప్రపంచ భక్తజనం 500 ఏళ్లుగా ఎదురుచూస్తున్న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ వేళ విశాఖలో ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సింహాచలంలో వెలసిన శ్రీరాముని పుణ్యక్షేత్రం నుంచి అన్ని దేవాలయాల్లోను తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మహిళలు, పెద్దలతో పాటు యువతీ, యువకులు కూడా పెద్ద ఎత్తున ఆలయాలకు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రార్థనాలు, కీర్తనలు, భజనలు చేశారు.

పరవశించిన భక్తజనం

అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్టతో విశాఖ భక్తజనం పులకించిపోయింది. పండగ తరహాలోనే ఇళ్లను ముస్తాబు చేసుకున్నారు. మామిడి తోరణాలు, పూలతో అలంకరించుకున్నారు. కూడళ్లలో శ్రీరాముడి భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో నివాస సముదాయాలలో ప్రత్యేకంగా సామూహిక భక్తి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని సంబరాలు చేసుకున్నారు. ఇళ్లపైనే కాకుండా అనేక మంది తమ వాహనాలకు కూడా శ్రీరాముడి జెండాలు కట్టుకున్నారు. రాముడి విగ్రహాలతో కోలాటాలు, భజనాలతో శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

లైవ్ స్ట్రీమింగ్ కోసం స్క్రీన్లు

అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రతి ఒక్కరూ టీవీలకు అతుక్కుపోయారు. కొన్ని ప్రాంతాలు, అపార్టుమెంట్లు, కమ్యూనిటీల్లో భక్తులు లైవ్‌స్ట్రీమింగ్ చూసేందుకు పలు స్క్రీన్లు ఏర్పాటు చేశారు.



సీతారామచంద్రులు, లక్ష్మణ్, హనుమత్ వేషధారణలో చిన్నారులు

ఆలయ ప్రారంభోత్సవాన్ని చూస్తూనే ప్రార్థనలు, భజనలు చేస్తూ పరవశించిపోయారు.

విభిన్నంగా రామభక్తి ప్రదర్శన

నగరంలో కొంత మంది విభిన్నంగా తమ రామభక్తిని ప్రదర్శించారు. ప్రధానంగా రుషికొండ సముద్రంలో 22 అడుగుల లోతున లివ్‌ఇన్ అడ్వెంచర్స్ సంస్థ శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట చేయడం అందరినీ ఆకర్షించింది. అలాగే విమాన్‌నగర్‌లో కేఎస్‌బీ పెరల్ అపార్ట్‌మెంట్ వాసులు 88 అడుగుల శ్రీరాముని భారీ చిత్ర పటాన్ని ఆవిష్కరించారు. ఒక అపార్టుమెంట్ సైజులో శ్రీరాముని పటాన్ని చూసి అందరూ పులకించిపోయారు. ఇలా అనేక ప్రాంతాల్లో భక్తులు అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠను పండుగలా చేసుకున్నారు.

అంబికాబాగ్ రామాలయంలో...

డాబాగార్డెన్స్: నగరంలోని కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లోక కల్యాణార్థం



అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను ఎల్ఇడీ స్క్రీన్ ద్వారా వీక్షిస్తున్న భక్తులు

విశ్వశాంతిని కాంక్షిస్తూ విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో శ్రీరామ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్ దంపతుల పూజలు

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరమంతా శ్రీరామ నామ జపంతో, కోలాహలంతో ఆనంద డోలికల్లో మునిగి తేలిందన్నారు. శ్రీరాముడు ధర్మ పరిపాలనను అందరూ ఆదర్శంగా తీసుకొని నగర అభివృద్ధికి, పరిపాలనకు సహకరించాలన్నారు. శ్రీరాముని చల్లని చూపుతో నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



ఇంట్లో పూజలు నిర్వహిస్తున్న మహిళ

హోంగార్డుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ: హోంగార్డుల నియామకానికి(స్వచ్ఛంద సేవ) విశాఖకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ కేటగిరీ (టెక్నికల్, ఇతర ట్రేడ్) కింద చేపట్టే ఈ నియామకంలో ఎంపికైన అభ్యర్థికి రోజుకు రూ.710 డ్యూటీ అలవెన్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 21 నుంచి 50 ఏళ్లలోపు గల డిగ్రీ పూర్తి చేసిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని వివరించారు. అభ్యర్థులు ఎల్ఎంవీ/హెచ్ఎంవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి అనుభవం ఉండాలన్నారు. బీసీఏ/ఎంబీఏ/బీఎస్సీ (కంప్యూటర్స్)/బీటెక్(కంప్యూటర్స్) లేదా ఇతర ఐటీ నైపుణ్యం ఉన్న వారికి అదనపు మార్కులు, ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తును సూర్యాబాగ్ ప్రాంతంలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో నేరుగా గానీ cp@vrpc.appoice.gov.in కు మెయిల్ చేయవచ్చని సూచించారు. ఫిబ్రవరి 3వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 4న ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆ రోజున సూర్యాబాగ్ పోలీస్ స్టేడియంలో నిర్వహించే ఐటీ, డ్రైవింగ్ పరీక్షతో పాటు పురుష అభ్యర్థులు 800 మీటర్లు 200 సెకన్లలో, మహిళలు 300 సెకన్లలో పరుగు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల వెరిఫికేషన్‌కు వచ్చే సమయంలో అభ్యర్థులు తప్పని సరిగా విద్యార్హత, కులం, లైట్/హెవీ డ్రైవింగ్ లైసెన్స్, కంప్యూటర్ విద్యార్హత పత్రాలు, విశాఖ నేటివిటీ సర్టిఫికెట్ ఒరిజినల్‌తో పాటు జెరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు.

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం రేపు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశ మందిరంలో మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో 33 అంశాలు చర్చకు రానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఓటర్లు 19,42,593

- పురుష ఓటర్లు 9,60,101 మంది
- మహిళా ఓటర్లు 9,82,380 మంది
- భీమిలిలో అత్యధికంగా 3,51,462 మంది ఓటర్లు
- పశ్చిమలో అత్యల్పంగా 2,06,943 మంది ఓటర్లు
- తుది జాబితా విడుదల చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట: తుది జాబితా నాటికి జిల్లాలో 19,42,593 మంది ఓటర్లు ఉన్నారని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ కె.ఎస్.విశ్వనాథన్ వెల్లడించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ ఈనెల 12వ తేదీన ముగిసిందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రచురణ ప్రతిని సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. జిల్లాలో 1,941 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,60,101 మంది పురుషులు, 9,82,380 మంది మహిళలు, 112 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో మోహన్ కుమార్

అత్యధికం భీమిలి–అత్యల్పం విశాఖ పశ్చిమ

- భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 3,51,462 మంది ఓటర్లు (పురుషులు 1,72,488 మంది, మహిళలు 1,78,957 మంది, థర్డ్ జెండర్ 17 మంది) ఉండగా, విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్యల్పంగా 2,06,943 మంది ఓటర్లు (పురుషులు 1,02,089 మంది, మహిళలు 1,04,844 మంది, థర్డ్ జెండర్ 10 మంది) ఉన్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో 1,35,516 మంది పురుషులు, 1,40,990 మంది మహిళలు, 17 మంది థర్డ్ జెండర్ ఓటర్లు వెరసి 2,76,523 మంది ఓటర్లు ఉన్నారు.
- విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 1,03,334 మంది పురుషులు, 1,06,764 మంది మహిళలు, 33 మంది థర్డ్ జెండర్ వెరసి 2,10,131 మంది ఓటర్లు ఉన్నారు.
- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 1,35,664 మంది పురుషులు, 1,39,078 మంది మహిళలు, 18 మంది థర్డ్ జెండర్ వెరసి 2,74,760 మంది ఓటర్లు ఉన్నారు.
- గాజువాక నియోజక వర్గంలో 1,62,434 మంది పురుషులు, 1,61,225 మంది మహిళలు, 12 మంది థర్డ్ జెండర్ వెరసి 3,23,671 మంది ఓటర్లు ఉన్నారు.
- పెందుర్తి నియోజకవర్గంలో 1,48,576 మంది పురుషులు, 1,50,522 మంది మహిళలు, 5 మంది థర్డ్ జెండర్ వెరసి 2,99,103 మంది ఓటర్లు ఉన్నారు.

2023 అక్టోబర్ 27న విడులైన ముసాయిదా ప్రచురణ నాటికి జిల్లాలో 19,15,682 మంది ఓటర్లు ఉండగా, అందులో 9,51,011 మంది పురుషులు, 9,64,538 మంది మహిళలు, 133 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ వివరించారు. ముసాయిదా జాబితా అనంతరం కొత్తగా 1,64,048 మంది ఓటర్లు నమోదు కాగా ఇందులో పురుషులు 79,824 మంది, మహిళలు 84,217 మంది, ఏడుగురు థర్డ్ జెండర్లు ఉన్నారు. ఓటర్లు జాబితా నుంచి వివిధ కారణాల(మరణించిన, డబుల్ ఎంట్రీ, వలసపోయిన వారు) వల్ల 1,37,137 మంది ఓటర్లను తొలగించగా, అందులో పురుషులు 70,734 మంది పురుషులు, 66,375 మంది మహిళలు, 28 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు

ముసాయిదా జాబితా తదుపరి తుది జాబితా నాటికి 26,911 మంది ఓటర్లు పెరిగినట్లు చెప్పారు. ఇందులో 9,090 మంది పురుషులు, 17,842 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే తుది జాబితా ప్రచురణ నాటికి జిల్లాలో 3,636 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,501 మంది పురుషులు, 135 మంది మహిళా ఓటర్లు ఉన్నారని వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు శాయశక్తులా కృషి చేశామన్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించడం, యువతను ఓటరుగా నమోదు చేయడం, పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లను విచారణ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు చెప్పారు. బూత్ స్థాయి అధికారి నుంచి శతశాతం దృష్టి సారించారన్నారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సంగివలస జాతీయరహదారి వద్ద భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడం తథ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఎన్నికల శంఖారావం పూరించి దిశా నిర్దేశం చేసే కార్యక్రమ వేదికకు సోమవారం సంగివలస జాతీయరహదారి పక్కన ఖాళీ స్థలంలో ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నాయకులతో సమావేశం కావడానికి భీమిలిని ఎంచుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలన్నారు. సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో ఈ ప్రాంతీయ సమావేశం విజయవంతం కావాలన్నారు. అందరికీ అనువుగా ఉన్న ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ యూత్ అధ్యక్షుడు ముత్తంశెట్టి శివనందీష్, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, 2వ వార్డు ఇంచార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు, మండల పార్టీల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, గుడ్ల పోలిరెడ్డి, మజ్జి వెంకటరావు, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, యూత్ అధ్యక్షులు చిల్ల హరి, అక్కరమాని చినబాబు, కోరాడ లక్ష్మణ, కోరాడ అప్పలస్వామి నాయుడు, పదాల రాము, సర్పంచ్‌లు సమ్మిడి శ్రీనివాసరావు, గాడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రహదారి భద్రత పాటిద్దాం



అవగాహన కల్పిస్తున్న టీడీసీ రాజారత్నం, రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్ఏడీ ఫ్లైఓవర్ అప్పర్ రోటరీలో వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నిబంధనలు తెలియజేస్తూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. హెల్మెట్ ధరించిన వారికి, సీటు బెల్టుతో ప్రయాణించిన వారికి గులాబీ పువ్వులు, చాక్లెట్లు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ శ్రీనివాసరావు, మోటారు వాహన తనిఖీదారులు మన్మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ వాసుదేవరావు, ఏఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది గుర్తించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫారంపై గేట్ నంబర్ 4 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు గుర్తించారు. ఇతని వయస్సు సుమారు 55-60 ఏళ్లు ఉండవచ్చని, సుమారు 5.9 అడుగుల ఎత్తు కలిగి శరీరం కుళ్లిపోయి, గుర్తించడానికి కూడా వీలులేకుండా ఉందని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ముదురు నీలం రంగు టీ షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. జీఆర్పీ సీఐ సీహెచ్ ధనుంజయనాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా లేదా 98664 13487, 94406 27547 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎక్కడి వారు అక్కడే..!

- సెల్ఫ్ సెంటర్లలోనే ఇంటర్ ప్రాక్టికల్స్
- కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పరీక్షల పర్యవేక్షణ
- ల్యాబ్ సౌకర్యం ఉన్న కాలేజీలే ఎంపిక
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు
- జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలు
- ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్
- హాజరుకానున్న 41,193 మంది విద్యార్థులు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు చదువుకున్న కాలేజీ (సెల్ఫ్ సెంటర్)ల్లోనే ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహం చేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 5 నుంచి, జనరల్ కోర్సులకు ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాల నిఘాలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు 150 కేంద్రాలను ఎంపిక చేసి, వీటి ఆమోదం కోసం ఇంటర్మీడియెట్ బోర్డుకు జాబితా పంపించారు. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు విధులు కేటాయించే అధ్యాపకుల జాబితాను సైతం ఆన్‌లైన్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించారు.

ప్రయోగాలకు అనువైన కాలేజీలకే అనుమతి

2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో జిల్లాలో 173 కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాలు జరిగాయి. వీటిలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఎంపీసీ 32,980 మంది, బైపీసీ 4,945 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. అదే విధంగా ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం 1,636 మంది, రెండో సంవత్సరం 1,632 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, 50 కంటే తక్కువ మంది విద్యార్థులు ఉంటే అలాంటి వారిని సమీప కాలేజీల్లో ప్రాక్టికల్స్‌కు హాజరుకావాల్సి ఉంది. అదే విధంగా మరికొన్ని చోట్ల ప్రాక్టికల్స్ పరీక్షలకు నిర్వహణకు అనువైన సౌకర్యాలు లేకపోవడంతో అలాంటి కాలేజీలను జాబితా నుంచి తప్పించారు. అక్కడి విద్యార్థులు సమీపంలోని మరో కేంద్రంలో ప్రాక్టికల్స్‌కు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

కార్పొరేట్ ఆగడాలకు అడ్డుకట్ట

ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ప్రాక్టికల్స్ మార్కులు ఎంతో కీలకమైనవి. ఎంపీసీలో భౌతిక, రసాయన శాస్త్రం అదే బైపీసీ విద్యార్థులైతే భౌతిక, రసాయన శాస్త్రం, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించి ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షకు 30 మార్కులు ఉంటాయి. గతంలో కొన్ని కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులు ప్రాక్టికల్స్ మార్కులతో విద్యా వ్యాపారం చేసేవారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేలా ఈసారి ప్రయోగ పరీక్షలపై నిఘా పెంచారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ మొత్తాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు చేయనున్నారు. దీనిని ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల సైతం పర్యవేక్షణ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం



ప్రాక్టికల్ పరీక్షల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. పరీక్షల నాటికి పూర్తి స్థాయిలో ప్రయోగ పరికరాలు, మెరుగైన వసతులు ఏర్పాటు చేసుకోవాలని కాలేజీల నిర్వాహకులకు సూచించాం. కొన్ని కాలేజీలు బహుళ అంతస్తు భవనాల్లో నిర్వహిస్తున్నారు. కానీ అలాంటి చోట్ల ప్రాక్టికల్స్ మాత్రం దిగువ ఫ్లోర్‌లోనే నిర్వహించాలి.

–రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, విశాఖ జిల్లా

ఉత్సాహంగా పోలీస్ కమాండో పోటీలు



సీఆర్‌పీఎఫ్ కమాండోలతో అతిథుల గ్రూప్ ఫొటో

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత పోలీస్ కమాండో పోటీలు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యమిస్తుండగా విశాఖలోని గ్రేహౌండ్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభమయ్యాయి. పదహారు రాష్ట్రాల పోలీస్ కమాండోలతో పాటు ఏడు కేంద్ర పోలీసు బలగాల జట్లు తొమ్మిది రోజుల పాటు ఐదు దశల్లో పోటీపడనున్నాయి. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పోటీలను ప్రారంభించారు. తొలుత ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ కమాండో జట్టుతో పాటు బీహార్, గుజరాత్, హర్యానా, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్ కమాండో రాష్ట్ర జట్లు, కేంద్ర పోలీస్ బలగాల జట్టైన అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్, ఎస్ఎస్‌బీలతో పాటు డిఫెండింగ్ చాంప్ హోదాలో ఐటీబీపీ కమాండో జట్లు అతిథులకు గౌరవవందనాన్ని సమర్పించాయి. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ విభాగంలోని అసాల్ట్ కమాండర్‌గానే 1997లో తన కెరీర్ ప్రారంభం కాగా నేడు అదే విభాగం ఆధ్వర్యంలో ఏఐపీసీసీ ప్రారంభ వేడుకకు హాజరు కావడం గర్వంగా ఉందన్నారు. తొలుత కార్యక్రమానికి అధ్యక్షత వహించి గ్రేహౌండ్స్ ఏడీజీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహించడం చక్కటి పరిణామమన్నారు. పోటీలకు సిద్ధమవుతున్న 23 జట్ల కమాండోలను అభినందించారు. నేవిగేషన్ దశతో పోటీలు ప్రారంభమై స్కిల్‌టెస్ట్, ప్లానింగ్ ఎగ్జిక్యూషన్, ఫిజికల్, ఫైరింగ్ రిఫ్లెక్సన్ కంబేట్ దశతో ముగియనున్నాయి. ఆయా జట్లు సాధించిన వ్యక్తిగత, జట్టు పాయింట్ల ఆధారంగా విజేతలకు 30వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు అందజేయనున్నారు. ఆపరేషన్స్ డీఐజీ కోయ ప్రవీణ్ పాల్గొన్నారు.



బెలూన్స్ ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏడీజీ మీనా, నగర సీపీ రవిశంకర్ తదితరులు

మూడు రోజుల్లో అర్జీలకు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలని అధికారులను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డయల్ యువర్ మేయర్‌కు 15, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 81 ఫిర్యాదులు స్వీకరించినట్టు చెప్పారు. మూడు రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించామన్నారు.

డయల్ యువర్ మేయర్‌కు 15..

మేయర్ చాంబర్లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 15 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నేరుగా బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వీటిలో అదనపు కమిషనర్ (పబ్లిక్ హెల్త్)కు ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి 3, పట్టణ ప్రణాళికా విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి ఒకటి, ప్రజారోగ్య విభాగానికి 4, యూసీడీ పీడీకి 2 కాల్స్ వచ్చాయి.

జగనన్నకు చెబుదాంకు కార్యక్రమానికి 81

జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన 81 వినతుల్లో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి 14, జోన్-3కి 16, జోన్-4 కి నాలుగు, జోన్-5కు తొమ్మిది, జోన్-6కు 19, జోన్-8కి ఎనిమిది రాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 10 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీసీపీ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జేకేసీ వినతులకు అధిక ప్రాధాన్యం

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీలను జేసీ విశ్వనాథన్, ఏసీపీ బాపూజీ, డీఆర్వో కె.మోహన్ కుమార్ స్వీకరించారు. మొత్తం 156 వినతులు అందగా, వాటిలో 38 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవి, 41 అర్జీలు జీవీఎంసీకి, 7 అర్జీలు పోలీసు శాఖ, 70 అర్జీలు ఇతర విభాగాలకు చెందినవి. రెవెన్యూ, పౌర సరఫరాలు, పేదలందరికీ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఎక్కువ అర్జీలు వచ్చాయి. రెవెన్యూ, జీవీఎంసీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం. ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు, రేపు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

విశాఖ సిటీ: సైబర్ నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఐడీ అదనపు ఎస్పీ పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఎం.వి.రవివర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ క్యాంపస్ ప్రాంగణంలో ఉన్న డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం, బుధవారం ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు, అధికారులకు, వివిధ బ్యాంకులు, ఇలా ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలపై నిపుణులు, అనుభవజ్ఞులతో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. తొలి రోజు ప్రారంభ కార్యక్రమంలో డీసీపీ కె.శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు, తదితరులు భాగస్వామ్యమవుతున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధిపై విమర్శలు చేస్తే ఊరుకోం

వైఎస్ షర్మిల వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు మాధవి వర్మ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు మాధవి వర్మ

సాక్షి, విశాఖపట్నం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్పించిన నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీది..అలాంటి పార్టీలో చేరి ఏపీ ప్రజలకు, వైఎస్సార్ అభిమానులకు తీవ్ర అన్యాయం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు మాధవి వర్మ మండిపడ్డారు. ఏపీలో అభివృద్ధి జరగలేదని అనడం సరికాదన్నారు. సోమవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్రంలో సువర్ణపాలన అందించిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఏపీలో జగనన్న సృష్టించిన వలంటీర్ వ్యవస్థను తమిళనాడులో ఇప్పటికే ప్రారంభించారని, త్వరలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రవేశపెట్టబోతుందన్నారు. నిజమైన గ్రామ స్వరాజ్యం ఏపీలో కనిపిస్తుంటే..ఇక్కడ కాంగ్రెస్‌కు పనేంటని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలపై కోర్టులో కేసులు వేసి అడ్డుకునేయత్నం చేస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును విమర్శిస్తే ప్రజలు మిమ్మల్ని నమ్ముతారన్నారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రత్యేక ప్యాకేజీ ముద్దు అని చెప్పిన చంద్రబాబుని ఎందుకు ప్రశ్నించడం లేదంటూ నిలదీశారు. రాజధానిని ముక్కలు చేసిన కాంగ్రెస్‌లో ఏ మోహం పెట్టుకుని చేరారని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నేత కంచరాన గాయత్రి పాల్గొన్నారు.

36 కి.మీ స్ఫూర్తి పరుగు



జై శ్రీరామ్ అంటూ పరుగులు పెట్టిన చల్లా సుబ్రహ్మణ్య శర్మ

మహారాణిపేట: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో నగరానికి చెందిన 55 ఏళ్ల ప్రముఖ ఇంజినీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ 36 కిలోమీటర్ల మేర జై శ్రీరామ్ అంటూ పరుగు తీశారు. ఎంవీపీ కాలనీలోని తన కన్సల్టెన్సీ కార్యాలయం వద్ద శర్మ పరుగు ప్రారంభించి బీచ్ రోడ్డు, కాళీమాత దేవాలయం, కోస్టల్ బ్యాటరీ, జగదాంబ, పోలీసు బ్యారెక్స్, అల్లిపురం, మెయిన్‌రోడ్డు, కాన్వెంట్ జంక్షన్, కంచరపాలెం,104 ప్రాంతం మీదుగా సింహాచలం చేరుకున్నారు. మొత్తం 36 కిలో మీటర్ల దూరాన్ని 4.30 గంటల్లో చేరుకున్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు ఈ పరుగులో పాల్గొన్నారు. అలాగే మట్టిని కాపాడాలంటూ 2022 మార్చి 21 నుంచి పరుగు తీస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త సూపర్ లగ్జరీలొస్తున్నాయ్!

- నెలాఖరుకు 32 బస్సుల రాక
- వీటిని దూర ప్రాంతాలకు నడిపే యోచనలో అధికారులు
- 3 నెలల్లో మరో 25 వరకు ఇతర బస్సులు వచ్చే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు కొత్త లగ్జరీ బస్సులొస్తున్నాయి. జిల్లాకు 50కి పైగా వివిధ రకాల బస్సులు అవసరం కానున్నాయి. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు కొన్నాళ్ల క్రితం యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో ఉన్నతాధికారులు వాటిని మంజూరు చేశారు. ఇలా మంజూరైన బస్సుల్లో 32 బస్సులు సూపర్ లగ్జరీలున్నాయి. ఇవి నెలాఖరుకల్లా రానున్నాయి. వీటిని డిమాండ్, ప్రయాణికుల రద్దీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దూరప్రాంతాలకు నడపనున్నారు. ఇప్పటికే నిర్ణీత కిలోమీటర్ల దూరం ప్రయాణించిన, కండిషన్ బాగాలేని బస్సులను నిబంధనల ప్రకారం సర్వీసుల నుంచి తొలగించారు. వాటి స్థానంలో ఈ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. అవసరానికి వినియోగించగా బస్సులు మిగిలి ఉంటే వాటిని స్పేర్‌గా ఉంచుతారు. మరోవైపు ఇప్పటికే మంజూరైన మిగిలిన బస్సుల్లో సూపర్ లగ్జరీలతో పాటు అల్ట్రా డీలక్స్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు, పల్లె వెలుగులు, సిటీ బస్సులు ఉన్నాయి. ఈ సర్వీసులు మరో మూడు నెలల్లో విశాఖకు రానున్నాయని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. దశల వారీగా వచ్చే ఈ సర్వీసులను ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ రూట్లకు కేటాయిస్తామని తెలిపారు. కాగా కాలం చెల్లిన (నిర్ణీత కిలోమీటర్లు పూర్తి చేసుకున్న)ప్పటికీ ఇంజిన్ కండిషన్ బాగున్న సూపర్ లగ్జరీ బస్సులను కూడా మరో విధంగా వినియోగంలోకి తెస్తున్నారు. ఇలాంటి బస్సుల ఛాసిస్‌లు మరికొన్నేళ్ల పాటు పనికొస్తాయి. దీంతో ఈ బస్సులకు విజయనగరంలోని జోనల్ వర్క్‌షాపులో సరికొత్తగా బాడీలు నిర్మిస్తున్నారు. వీటిని సిటీ, పల్లె వెలుగు బస్సులుగా నడపనున్నారు. ఫలితంగా కొత్తగా సిటీ/పల్లెవెలుగు బస్సులను కొనుగోలు చేయాల్సిన అవసరం కొంతవరకు తప్పుతుంది. విశాఖ జిల్లాకు కొత్త బస్సులు వస్తే ఇన్నాళ్లూ పాత బస్సులకు వెచ్చించే నిర్వహణ (మెయింటెనెన్స్) వ్యయం కూడా ఆర్టీసీ తగ్గుతుంది. అలాగే దూరప్రాంత ప్రయాణికులకు కొత్త బస్సుల్లో ప్రయాణించడం వల్ల సౌకర్యవంతంగానూ ఉంటుంది.

మందుబాబులకు జరిమానా, జైలు

విశాఖ సిటీ: మద్యం తాగి వాహనాలు నడిపే మందుబాబులకు కిక్కు దిగేలా కోర్టు తీర్పు ఇచ్చింది. నగరంలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 163 మందికి రూ.7.17 లక్షలు జరిమానా విధించింది. అలాగే ఒకరికి 11 రోజుల జైలు శిక్ష విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం చేసిన తనిఖీల్లో గోపాలపట్నం, పెందుర్తి , మల్కాపురం, మహారాణిపేట, టూటౌన్, ఫోర్త్ టౌన్, ద్వారకా, స్టీల్‌ప్లాంట్, కంచరపాలెం, గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలలో 164 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరికి రూ.7.17 లక్షల జరిమానాతో పాటు కంచరపాలెం పరిధిలో ఒకరికి 11 రోజులు జైలు శిక్ష విధించారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	563.00
విజయనగరం	567.00
శ్రీకాకుళం	567.00